

# సంసారంలో సరిగమలు

## - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

### "నువ్వే" కావాలి

**"సిరి ప్లీజ్ ఒప్పుకోవా?"**

"నో సుబ్బూ ఒప్పుకోను. ఐ యాం సారీ."

"ప్లీజ్ సిరీ"

"సారీ సుబ్బూ."

దాదాపు అరగంట నుంచి వారి మధ్య ఇదే రకం సంభాషణ కొద్దిగా అటూ ఇటూగా నడుస్తోంది. సోఫాలో పడుకుని ఫిల్మ్ ఫేర్ చదువుకుంటోంది సిరి. ఆమె పక్కన ఇరుగ్గా కూర్చుని సహనంగా బ్రతిమలాడుతున్నాడు సుభాష్.

"ఈ ఒక్కసారికీ సరే అను. ఇంకెప్పుడూ అడగను" మరోసారి ప్రాధేయపడ్డాడు సుభాష్.

"నువ్వే ఇంకేదైనా కోరిక కోరుకో సుబ్బూ తీరుస్తా. అంతేకానీ ఇదే విషయమైతే మాత్రం పెద్ద 'నో'. నేనొప్పుకోను. నన్ను ప్రశాంతంగా చదువుకోనివ్వవా?" విసుక్కుంది.

"అదేమరి పెద్ద ఐ.ఏ.ఎస్ ఎగ్జామ్‌కి చదువుతున్నావ్?"

"ఆ వెటకారాలంటే నాకు ఒళ్ళుమంట. వెళ్ళి మంచి కాఫీ కలుపుకొస్తావా?" అడిగింది.

"తెస్తాకాని మరి ఒప్పుకుంటావా?" ఆశగా అడిగాడు.

"అబ్బా! శివశివా!"

పావుగంటలో కాఫీ కప్పుతో వచ్చిన సుభాష్, సిరి మొదటి గుక్కతాగేదాకా ఆగి అడిగాడు.

"ఎలా ఉంది?"

"ఆహాఁ అద్భుతంగా ఉంది సుబ్బూ. రాత్రికి పొటాటో ఫ్రై చేస్తావా?"

"తప్పకుండా మరి ఒప్పుకుంటావా?"

"అబ్బా!" పెద్దగా అరిచి సుబ్బు జుట్టులోకి వేళ్ళు పోనించి లాలనగా చెప్పింది సిరి.

"చూడు సుబ్బూ మనం ఎంత హేపీగా, ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉన్నామో కదా? ఆవిడ వచ్చిందంటే మన మధ్య ఈ ఆనందం ఉండదేమో అని నాకు భయంగా ఉంది. అందుకనే వద్దంటున్నాను. ప్లీజ్ అర్థం చేసుకో."

"నువ్వే నన్ను అర్థం చేసుకోవాలి సిరీ. మా రామన్నాయ్ దుర్మార్గుడు ఫోన్ చేసి 'ఒరేయ్ రేపు ఫ్రీయేనా?' అంటే భోజనానికి పిలుస్తాడేమో అని 'ఫ్రీ ఫ్రీ' అని చెప్పా. 'ఇంకేం స్టేషన్‌కి వెళ్ళి అమ్మని తీసుకువచ్చి ఈ శనాదివారాలు మీ ఇంట్లో ఉంచుకో. సోమవారం పొద్దున్నే తీసుకెళ్తా' అన్నాడు. ఏం చెయ్యను చెప్పు." బిక్కమొహం వేసాడు సుభాష్.

"ఆయన ఏ వనవాసాలకి ఏగుతున్నాట్ట లక్ష్మణ స్వామీ?"

"నేను షిరిడీ టిక్కెట్లు బుక్ చేసుకున్నాక శనివారం పొద్దున గోదావరిలో వస్తున్నానని అమ్మ ఫోన్ చేసిందిరా, మరేం చేస్తాను. ఊళ్ళో నువ్వున్నావు కాబట్టి సరిపోయింది - అన్నాడు."

"నా డౌట్ ఏమిటంటే మీ రామన్నాయ్ ఆవిడ గోల రెండురోజులైనా తప్పించుకోవచ్చని ఈ ప్లాన్ వేసి ఉంటాడు. మేబీ ఇంట్లోనే ఉండి ఉంటాడు."

"ఛ ఛ వాళ్ళు ఇవాళ రాత్రి రైల్లో షిరిడీ వెళ్తున్నారు. మనం వీకెండ్ ఎంజాయ్‌మెంట్‌ని కోల్పోతాం అంతే కదా సిరీ. ఈ రెండు రోజులు ఆవిడ మనింట్లో ఉంటే ఏంటి నీ ప్రాబ్లం? ఇదే మా అమ్మో, మీ అమ్మో అయితే ఇట్లా మాట్లాడతావా?"

"చూసావా సుబ్బూ! ఆవిడ రాకుండానే ఆ ప్రభావంతో నిష్ఠూరాలు మాట్లాడుతున్నావ్? అదే నాకు భయం మీ అమ్మ అయితే నా పర్మిషన్ అడుగుతారా? నేను వద్దంటానా? పాపం ఆంటీ.. బంగారుతల్లి చెట్టంత కొడుకుని నా చేతుల్లో పెట్టి ఎంత నిశ్చింతగా ఉందో ఐ లవ్ హర్"

"మరి పెద్దమ్మ అయితే ఏం ప్రాబ్లం?"

"ఆవిడే ఓ ప్రాబ్లం. మన పెళ్ళిరోజు నన్ను చూసి పెళ్ళికూతురు పెళ్ళికొడుకు కంటే నలుపు అని పెద్దగా అరిచి మరీ చెప్పింది. మీ మమ్మీని కోప్పడింది కూడా నల్లపిల్లని కోడలుగా తెచ్చుకుంటావా అని"

"ఓహో! అప్పుడెప్పుడో అట్లా అందని కడుపులో పెట్టుకుని ఇప్పుడు అంటావా? అమ్మ సిరీ" గుండెల మీద చేతులు వేసుకున్నాడు సుభాష్.

"కడుపులో కాదనుకుంటా సుబ్బు. మనసులో పెట్టుకుని అనాలేమో?"

"ఎక్కడోక్కడ. ఆవిడ కొంచెం నోటి దురుసు మనిషి. ఒప్పుకుంటా. కొంచెం అడ్జస్టవు. సోమవారం పొద్దునే రామన్నాయ్ రాకపోయినా నేనే వెళ్ళి దింపేసొస్తా సరేనా?"

సిరి సుభాష్ దగ్గరకి వెళ్ళి అతని గాఢంగా హత్తుకుని చెప్పింది.

"సుబ్బూ! మీ పెద్దమ్మ ఏమన్నా నువ్వు నన్ను విసుక్కోకు. నాకు నీ నుంచి కేవలం ప్రేమేకావాలి. మనింటికి ఎవరైనా వస్తారంటే నాకెందుకో భయంగా, ఇన్‌సెక్యూర్‌గా ఉంటుంది. అలాంటిది మీ పెద్దమ్మలాంటి బ్రహ్మరాక్షసి మన మధ్య తగవులు పెడుతుందేమో అని బెంగగా ఉంది."

"పిచ్చి సిరీ ఆవిడ ఏమన్నా నేను పట్టించుకోను. నువ్వూ పట్టించుకోకు" అన్నాడు సుభాష్.

"నలభై ఎనిమిది గంటలు సుబ్బూ" దిగులుగా చూసింది సిరి.

●●●

"ఈ సోఫా లేమ్మిటా ఇట్లా అడ్డదిడ్డంగా వేసారు? చక్కగా ఎదురుబొదురు వేస్తే బోల్డంత చోటు కలిసొస్తుంది" పెద్దగా వినబడే మాటలకి ఉలిక్కిపడిలేచింది సిరి. పక్కన సుభాష్ లేడు. రైల్వే స్టేషన్‌కి వెళ్ళి పెద్దమ్మని తీసుకొచ్చినట్లున్నాడు.

"పెద్దమ్మా ముఖం కడుక్కుంటావా కాఫీ ఇస్తాను" సుభాష్ అడుగుతున్నాడు.

"నీ పెళ్ళాం ఏమైంది, కాఫీ నువ్వు ఇస్తానంటున్నావు?" కఠినంగా వినబడింది పెద్దమ్మగొంతు.

"ఉంది ఈ రోజు శనివారం కదా. తను లేట్‌గా లేస్తుంది. "

"అంటే? ఆ మహారాణి లేవకుండా నీ చేత సేవలు చేయించుకుంటుందా? మీ అమ్మ నిన్ను రాజకుమారుడిలాగా పెంచి పెద్ద ఇంజనీర్ని చేసింది ఇందుకేన్రా?"

చటుక్కున లేచింది సిరి. హాల్లో సోఫాలో కూర్చుని, టి.వి రిమోట్‌లో ఛానల్స్ మారుస్తున్న ఆవిడని చూసి చెప్పింది.

"నమస్తే పెద్దమ్మా. బావున్నారా?"

ఆవిడ సిరివైపు ఎగాదిగా చూసింది.

"తెలివి తెల్లారినట్లే ఉంది. నేను వాడికి పెద్దమ్మని. నీకు పెద్దత్తగార్ని. అత్తయ్యగారూ అనాలి."

"నేను పెద్దమ్మ అనే అంటా. సుబ్బూ ఎలా పిలిస్తే నేను అలాగే పిలవడం అలవాటైపోయింది."

"ఓహో! మీ అత్తగారి నే మంటావ్?"

"మమ్మీ"

"మరి మీ అమ్మని?"

"అమ్మ"

"నీలాంటివాడే చిన్నప్పుడు కాకరకాయ అని, చదువుకున్నాక కీకరకాయ అన్నాట్ట. ఐనా లక్షణంగా వాడికి సుభాష్ చంద్రబోస్ అని పేరు పెడితే సుబ్బూ ఏమిటమ్మాయ్? ఏమండీ అనలేవు?"

"ఏమండీ?" ఫక్కున నవ్వింది సిరి.

కాఫీ కప్పుతో వచ్చిన సుబ్బూ సిరిని చూసి చెప్పాడు.

"సిరీ, నీక్కూడా కాఫీతేనా?"

"తీసుకురా సుబ్బూ. ఒన్ మినిట్‌లో బ్రషింగ్ చేసుకుని వస్తా."

బెడ్ రూంలోకి వెళ్ళిపోయింది.

"ఒరేయ్ పెళ్ళాం కొంగు పట్టుకునే వెధవలాగా అయ్యావేంట్రా ఖర్మ. నువ్వుదానికి కాఫీ ఇవ్వడం ఏమిటి?" లబలబలాడింది పెద్దమ్మ.

"మా ఇంట్లో అంతే పెద్దమ్మ. శని ఆదివారాలు నేనే వంటచేస్తా" నవ్వుతూ చెప్పాడు సుభాష్

"సిగ్గులేకుండా ఇంకా నవ్వుతూ చెపుతున్నావా?" ఉగ్రంగా అరిచిందావిడ.

"ష్! అరవకండి. పక్క ఫ్లాట్స్ వాళ్ళు వింటారు" చెప్పింది సిరి.

ఆమెని నమిలి మింగేసేలా చూస్తూ లోపలికి వెళ్ళింది పెద్దమ్మ.

●●●

"అవునా సుబ్బూ. ఆ పిల్ల నిక్కర్లేసుకుని తిరగడం ఏంటీ?" సుభాష్‌తో నెమ్మదిగా చెప్పింది పెద్దమ్మ.

"ఏం బానే ఉందిగా?"

"ఏం బాగుంది? నీ మొహంలా ఉంది. శుభ్రంగా చీర కట్టుకోవచ్చుగా?"

పెద్దగా నవ్వాడు సుభాష్.

"పెద్దమ్మా! సిరికి చీర కట్టుకోవడం రాదు"

"ఏం ఆడది కాదూ?"

"పెద్దమ్మగారూ" కఠినంగా చెప్పింది సిరి.

"మీరు నా విషయంలో విమర్శలు మానండి. మీరూ, మీ సుబ్బూ మీ విషయాలు మాట్లాడుకోండి. అంతేకానీ నా పర్సనల్ వ్యవహారాల్లో తల దూర్చద్దు."

"అంటే నిన్ననే హక్కు నాకు లేదా?"

"లేదు."

"కనీసం వాడికుందా?"

"వాడికి కూడా లేదు. సుబ్బూ. నేను లావణ్య వాళ్ళింటికెళ్తున్నాను. మండే ఆఫీస్‌కి కూడా అటే వెళ్ళి ఈవినింగ్ ఇంటికి వస్తా."

వెళ్ళిపోయింది సిరి.

"ఒరేయ్ వెర్రి నాగన్నా. చూసావా నీ పెళ్ళానికి నువ్వంటే ఎంత విలువుందో?" వ్యంగ్యంగా నవ్వుతూ అడిగింది పెద్దమ్మ.

●●●

"వెరీసారీ సుబ్బూ. నేను వెళ్ళాక ఆవిడ నిన్ను ఇంకా సాధించి ఉంటుంది"

"సిరీ. ఆవిడ ఉన్న రెండు రోజులు కొంచెం ఓపిక పట్టి, ప్రశాంతంగా ఉంటే బావుండేదేమో ఆలోచించు" ఫోన్ పెట్టేసాడు సుభాష్

సాయంత్రం ఇంటికి వస్తూంటే ఎందుకో బెరుకుగా అనిపించింది సిరికి.

సుభాష్ ఇంట్లోనే ఉన్నాడు. సిరిని చూడగానే వెళ్ళి కాఫీ కప్పుతో వచ్చాడు. అతని మొహంలో ఎప్పుడూ తొణికిసలాడే సహజ సిద్ధమైన చిరునవ్వులేదు.

మౌనంగా కాఫీతాగి కప్పుని టీపాయ్ మీద పెట్టింది సిరి. లేచి దాన్ని తీసుకెళ్ళి సింక్‌లో ఉంచాడు సుభాష్. తర్వాత కూర్చుని లాప్‌టాప్ చూసుకోసాగాడు. అరగంటైనా అందులోంచి తలెత్తలేదు. భరించలేకపోయింది సిరి. లేచి అతని పక్కన కూర్చుని భుజం మీద తలపెట్టి అడిగింది.

"కోపం వచ్చిందా సుబ్బూ?"

"లేదు"

"మరి?"

"నీ మీద కోపం వచ్చే హక్కుందా సిరీ నాకు?"

"సుబ్బూ" దెబ్బతిన్నట్లుగా చూసింది.

"నువ్వే అన్నావుగా నాకు నీమీద హక్కు లేదని."

"అందుకే సుబ్బూ ఈ చుట్టాలు, పక్కాలు మనింటికి రావద్దనేది. మనం హేపీగా ఉండటం చూడలేరు. నన్ను ఎవరైనా విమర్శిస్తే తట్టుకోలేను. అందుకే వెళ్ళిపోయాను. నీకు ఇంతకోపం వస్తుందనుకోలేదు."

"విమర్శిస్తే ఎవరూ తట్టుకోలేరు సిరీ. విమర్శించే అవకాశం లేకుండా చేయడం తెలివిగల వాళ్ళ లక్షణం. పైగా నువ్వు అనాధని చేసుకోలేదు. నాకు బంధువులు, స్నేహితులు ఉంటారు. మనిషి సంఘజీవి. నాకు అవసరమైనప్పుడు మా అమ్మని తీసుకెళ్ళమని ఇప్పుడు రామన్నాయ్‌ని అడగగలనా?"

"మరి ఆవిడ నన్నెందుకు అలా అనాలి?" ఉక్రోషంగా అడిగింది.

"అనే అవకాశం నువ్వే ఇచ్చావు. ఇంటికి చుట్టం వచ్చినప్పుడైనా నువ్వు వంటగదిలోకి వెళ్దామనుకోలేదు. కనీసం ఆ రెండు రోజులైనా పంజాబీ డ్రెస్ వేసుకుందాం అనుకోలేదు. నీ ఇష్టప్రకారమే నువ్వున్నావు. నవ్వుతూ నేనెంత కవర్ చేసినా నీకు నేను అవమానపడుతున్నాననే స్పృహలేదు. ప్రేమంటే ఇదానా సిరీ? నీ ఇష్టం వచ్చినట్లే ఉండి, నీకు కాఫీ కలిపిపెట్టి.. మరి నీ ప్రేమని నా మీద ఎలా చూపిస్తున్నావ్ సిరీ? ఆలోచించు. ఇదే నీ వైపు వాళ్ళెవరైనా వస్తే నేను నీలా మాత్రం ప్రవర్తించేవాడిని కాదు." మెల్లిగా చెప్పినా స్థిరంగా చెప్పాడు సుభాష్.

అతని చెప్పినవన్నీ నిజాలే అని తెలుసు సిరికి, ఒప్పుకోవడానికి అహం అడ్డు వచ్చినా, తను సుబ్బుమీద ప్రేమని ఎలా చూపిస్తోందా అని ఆలోచించసాగింది.

'నీకు వంటచేయడం రాదా సిరీ? కాఫీ కలపడంకూడా రాదా? అయ్యో! పర్లేదులే. నేను పిజి చేసేప్పుడు ఓ రూంలో వండుకు తిని కాలేజీకి వెళ్ళేవాడిని. నేను చేసి పెడతాలే.' అని ఆ మాట ప్రకారమే మూడేళ్ళనుంచి తనని వంటగదిలోకి రానివ్వని సుభాష్, 'ఇంట్లో ఉన్నప్పుడూ నీకు హాఫ్ పేంట్స్ అలవాటా సిరీ? బానే ఉందనుకో. కాకపోతే ఇంటికి ఎవరైనా వచ్చినప్పుడు పొడుగు పేంట్లు వేసుకో బంగారూ' అనే సుభాష్, 'నీ జీతం ఏం చేస్తున్నావ్' అని అడక్కుండా తన జీతంతో ఇల్లు నడిపే సుభాష్, నిజంగా తను అతని కోసం ఏం చేసింది? అతని సేవలని ఉపయోగించుకుంది. ప్రేమని దుర్వినియోగం చేసింది. అతనింటికి అతని పెద్దమ్మరావడానికి వీలులేదని గొడవ చేసింది. వచ్చినావిడని అవమానపరిచింది. సుబ్బు పరువు పోతుందని కూడా ఆలోచించకుండా బయటకి వెళ్ళి పోయింది. అంటే తన చర్యలని ఎవరూ విమర్శించకుండా, తనకి చాకిరి చేసి, అడుగులకి మడుగులొత్తితే వాళ్ళు తనని ప్రేమిస్తున్నట్లు. కానీ తనకి ఆ ప్రేమని తిరిగి ఇవ్వడం చేతకాదు.

దుఃఖం వచ్చింది సిరికి. పాపం 'నాకు పిల్లలంటే చాలా ఇష్టం సిరీ' అంటే 'ఛీ నాకు అసహ్యం' అని తన రిప్లై. 'పోన్లే. నీకు ఇష్టమున్నప్పుడే ప్లాన్ చేద్దాం. ఐనా నువ్వు చిన్నపిల్లవేగా' అని అతని సర్దుబాటు.

"సారీ సుబ్బూ. నువ్వు రేపటినుంచి కొత్త సిరిని చూస్తావు చూడు." చెప్పింది.

సుభాష్ మెల్లగా నవ్వాడు. తాత్కాలిక ఉద్వేగాలతో తీసుకునే నిర్ణయం తాత్కాలికంగానే అమలు అవుతాయని తెలుసతడికి.

*(వచ్చే సంచికలో మరో సరిగమ)*

Click here to share your comments on this story